దరఖాస్తుల ఆహ్వానం

డిస్టెన్స్ కోర్సుల్లో ప్రవేశాలు..

వికారాబాద్, మార్చి 12 : ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.రాంరెడ్డి దూర విద్యలో వివిధ డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ (ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ) డిప్లొమా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వికారాబాద్ ఎస్ఏపీ కళాశాల ప్రిన్సిపాల్ మందారిక, పీజీఆర్ఆర్ సీడీఈ దూరవిద్య సమన్వయకర్త రాంచంద్రయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఒకే అకాడమిక్ ఇయర్‌లో ఒక కోర్సును చదువుతూ.. అదే సమయంలో ఒకే అకాడమిక్ ఇయర్‌లో ఒక రోర్సు రెగ్యులర్‌గా చదువుతూ, అదే సమయంలో ఒక దూర విద్య కోర్సును కూడా చదవడానికి యూజీసీ, ఉస్మానియా యూనివర్సిటీ 2023-24 సంవత్సరం నుంచి అవకాశం కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 31 వరకు www.oucde.net వెబ్ సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఫారంతో పాటు ఒరిజినల్, జిరాక్స్ కాపీ లు, ఫొటోలతో ఎస్ఏపీ కశాశాలలో సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నంబర్లలో 9701677993, 9908820446 సంప్రదించాలన్నారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు

వికారాబాద్, మార్చి 12 : జిల్లాలో ఇంటర్ పరీక్షలు సజావుగా సాగుతున్నాయి. బుధవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 29 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొత్తం 7,425 మంది విద్యార్థులకు 7,263 మంది పరీక్షలు రాశారు. 162 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని నోడల్ అధికారి తెలిపారు. వీరిలో జనరల్ విద్యార్థులు 6,187 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 6,071 మంది రాశారు. 116 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,238 మందికి 1,192 మంది పరీక్షలకు హాజరు కాగా 46 మంది గైర్హాజరయ్యారు.

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్, ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ వన్ టైం ఛాన్స్ పరీక్షలను ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్సైట్‌లో చూసుకోవాలని ఆయన సూచించారు.

ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలతో పాటు బీఈడీ పరీక్షల రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

బీసీఏ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీసీఏ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీఏ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్ష ఫీజును ఈ నెల 21వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

తాగునీటితో బైక్ వాష్

సిటీబ్యూరో, మార్చి 12(నమస్తే తెలంగాణ): తాగునీటిని వృథా చేస్తున్న వారిపై కఠిన చర్యలు ఉంటాయని వాటర్ బోర్డు మరోసారి స్పష్టం చేసింది. ఈనెల 5న జూబ్లీహిల్స్‌లోని ఓ ఇంటి యజమాని బైక్ వాష్ చేసేందుకు వాటర్ బోర్డు నీటిని వినియోగించడంతో స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన వాటర్ బోర్డు డివిజన్-6 మేనేజర్ తనిఖీ చేసి ఇంటి నంబర్ 8-2-293/82/జే/ఏ/20లోని యరత శోభకు రూ. 1000 ఫైన్ వేశారు. వాటర్ బోర్డు పరిధిలో తాగునీటిని వృథా చేసినట్లు అయితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వ్యవసాయ చట్టాలపై అవగాహన అవసరం

- వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి
- ఫర్టిలైజర్ డీలర్లకు పలు అంశాలపై అవగాహన

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యసాయాధికారి మోహన్‌రెడ్డి

కొడంగల్, మార్చి 12 : ఫర్టిలైజర్ డీలర్లకు వ్యవసాయ చట్టాలపై అవగాహన ఉండాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామ రైతు వేదికలో డివిజన్ స్థాయి ఫర్టిలైజర్ డీలర్లకు వ్యవసాయ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రానున్న వర్షాకాల సీజన్‌లో పండించే పంటలకు సంబంధించి రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని సూచించారు. నకిలీ విత్తనాల బారిన పడి రైతులు నష్ట పోకుండా డీలర్లు సహకరించాలన్నారు. ప్రతి అమ్మకానికి సంబంధించి తప్పకుండా బిల్లు ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతి లేని, నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా నివారించేందుకు డీలర్లు వ్యవసాయ శాఖకు సహకరించాలని సూచించారు. రైతులకు అధిక దిగుబడులు వస్తాయని వత్తిడి చేసి విత్తనాలు అమ్మినా, లూస్ విత్తనాల విక్రయాలకు సహకరించినా పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఏడీఏ శంకర్‌రాథోడ్ మాట్లాడుతూ.. నాణ్యమైన విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకొని భద్రపరచాలని, తనిఖీల్లో భాగంగా అధికారులు వచ్చిన సందర్భంలో సహకరించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు తులసి, హిమబిందు, ఏఈవోలు రాజరాథోడ్, అశ్విని, కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల మండలాల డీలర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పకడ్బందీగా నిర్వహించాలి

అధికారులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

యాచారం, మార్చి 12 : ఉపాధి హామీ పథకం పనులను పకడ్బందీగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహన అధికారి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల పరిషత్ కార్యాలయాన్ని పరిశీలించారు. మండల అభివృద్ధి పనులపై ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలతను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మాణ దశలో అర్ధాంతరంగా నిలిచిపోయిన సమావేశ మందిరాన్ని పరిశీలించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి పని కల్పించాలన్నారు. వేసవిలో హరితహారం, నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా సంరక్షించాలన్నారు. గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. అన్ని గ్రామాల్లో వేగవంతంగా వంద శాతం పన్నులు వసూలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు వారికి అందుబాటులో ఉండాలన్నారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలన్నారు. విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఈజీఎస్, పంచాయతీ అధికారులు ఉన్నారు.

అసెంబ్లీ సమావేశాల్లో దివ్యాంగుల సమస్యలపై చర్చించాలి

వికారాబాద్, మార్చి 12 : అసెంబ్లీ సమావేశాల్లో దివ్యాంగుల సమస్యలపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చర్చించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు పోతుర సుధీర్ కోరారు. బుధవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో దివ్యాంగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీ స్పీకర్ చొరవ చూపాలన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి.. నేటికీ పెంచకపోవడంపై మండిపడ్డారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.4వేల పెన్షన్ తమ అవసరాలకు సరిపోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్ పెంచేలా అసెంబ్లీలో ప్రకటన చేయడంతో పాటు రాష్ట్రంలో దివ్యాంగులపై పెరుగుతున్న దాడులు, అత్యాచారాలు, అఘాయిత్యాలను అరికట్టేందుకు వికలాంగుల అట్రాసిటీ చట్టం 2016 సమర్థవంతంగా అమలు చేసేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం పరిగి మండల అధ్యక్షుడు పసుల చెంద్రయ్య, దోమ మండల అధ్యక్షుడు చుక్కయ్య, నాయకుడు శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు సుధీర్

స్పందించారు.. పరిష్కరించారు

- బొంగుళూరు ఆదర్శ పాఠశాలలో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారుల చర్యలు
- స్పందించిన కలెక్టర్
- రూ.3లక్షల నిధులు మంజూరు
- సమస్య పరిష్కారంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆనందం

తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు, కమిషనర్ బాలకృష్ణ

ఆదిబట్ల, మార్చి 12 : మున్సిపాలిటీ పరిధిలోని బొంగుళూరు ఆదర్శ పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించారు. విద్యార్థులు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులపై నమస్తే తెలంగాణలో వచ్చిన సీఎం సారూ.. తాగునీరు ఇప్పించండి అనే కథనానికి కలెక్టర్ స్పందించారు. సమస్యను పరిష్కరించాలని రూ.3లక్షలు మంజూరు చేశారు. వెంటనే సమస్య పరిష్కారం కోసం ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ కృష్ణి చేశారు. బొంగుళూరు ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు తాగు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు సొంతంగా డబ్బులు కూడ బెట్టుకుని పక్కనే ఉన్న కిరాణ షాపు నుంచి తాగునీటి క్యాన్లను కొనుగోళ్లు చేస్తున్నారు. విద్యార్థుల సమస్యను ఎవరూ పట్టించుకోక పోవడంపై నమస్తే తెలంగాణలో వచ్చిన కథనానికి కలెక్టర్ స్పందించి ఆదేశాలు జారీ చేయడంతో.. వెంటనే ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ పక్కనే 500 మీటర్ల దూరంలో ఉన్న బోరులో మోటర్‌ను ఏర్పాటు చేసి పైప్‌లైన్ ద్వారా ఆదర్శ పాఠశాలకు నీరు అందేలా చర్యలు చేపట్టారు .కలెక్టర్ ఆదేశించి 24 గంటలు కాక ముందే పాఠశాలలో నీటి సమస్య పరిష్కారం కావడంతో పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక చొరవ

ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగుళూరు ఆదర్శ పాఠశాలపై పుర కమిషనర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. గతంలో పాఠశాలలో విద్యార్థులు మట్టినేలపై కూర్చుని భోజనాలు చేస్తుండడంతో వెంటనే పాఠశాలలో రూ.3లక్షలు వెచ్చించి సిమెంట్ బల్లాలను ఏర్పాటు చేశారు. గతంలో పాఠశాలలో తాగు నీటి కోసం 3 బోర్లు వేయించారు. వాటిలో నీరు పడక పోవడంతో వాటిని వృథాగా వదిలేశారు. త్వరలోనే సిమెంట్ బల్లాలపై విద్యార్థులు కూర్చుని భోజనాలు చేస్తున్న సమయంలో చెట్లపై పక్షులు కూర్చుని రెట్ట వేస్తున్నాయని చెప్పడంతో వెంటనే పైనుంచి షెడ్డును ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని అన్నారు. నేడు కలెక్టర్ ఆదర్శ పాఠశాలలో తాగు నీటి సమస్యను పరిష్కరించాలని ఆదేశించి 24 గంటలు కాక ముందే కమిషనర్ ప్రత్యేకంగా చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించారు. ఆదర్శ పాఠశాలలో సమస్యలపై మున్సిపల్ నిధులను వెచ్చించి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని కమిషనర్ తెలిపారు.

అజీజ్‌నగర్‌లో గంజాయి లభ్యం

మొయినాబాద్, మార్చి 12 : ఓ చికెన్ సెంటర్‌లో గంజాయి లభ్యం కావడంతో స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటన మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో బుధవారం జరిగింది. ఎస్సై నర్సింహారావు తెలిపిన వివరాలు.. బిహార్ రాష్ట్రానికి చెందిన మహబూబ్ అనే యువకుడు అజీజ్‌నగర్‌లోని ఏజీఆర్ చికెన్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. గ్రామంలోనే ఒక గదిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నాడు. అదనంగా డబ్బులు సంపాదించాలనే దురాలోచనతో గంజాయి విక్రయానికి అలవాటుపడ్డాడు. ఒక వ్యక్తి దూల్‌పేట్ నుంచి గంజాయి తీసుకొచ్చి మహబూబ్‌కు విక్రయిస్తాడు. ఈ ప్రక్రియ కొన్ని నెలలుగా కొనసాగుతున్నది. మహబూబ్ గంజాయిని నివాసం ఉంటున్న గదిలో పెట్టుకుని తెలిసిన వ్యక్తులకు గంజాయి అమ్ముకుని డబ్బులు సంపాదిస్తున్నాడు. ఎప్పటి మాదిరిగానే బుధవారం దూల్‌పేట్ నుంచి ఓ వ్యక్తి గంజాయి తీసుకొచ్చి చికెన్ సెంటర్‌లో విక్రయిస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. వెంటనే డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ఉపేందర్, ఎస్ఐ ఆర్ నర్సింహారావు చికెన్ సెంటర్‌కు చేరుకున్నారు. దూల్‌పేట్ నుంచి గంజాయి తీసుకొచ్చిన వ్యక్తి పోలీసులను చూసి పరారయ్యాడు. పోలీసులు చికెన్ సెంటర్‌లో తనిఖీ నిర్వహించగా రూ.20 వేల విలువ చేసే 2.5 కిలోల గంజాయి లభ్యమైంది. మహబూబ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

దీక్షలో కూర్చున్న ఎంఎస్ఎఫ్ నాయకులు

సీఎం రేవంత్‌ను భూస్థాపితం చేస్తాం

ఉస్మానియా యూనివర్సిటీ : మాదిగ విద్యార్థులు, నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిన సీఎం రేవంత్ రెడ్డిని రాజకీయంగా భూస్థాపితం చేస్తామని ఎంఎస్ఎఫ్ నాయకులు హెచ్చరించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం కాకముందే వివిధ పోటీ పరీక్షల ఫలితాలు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి దీక్షను భగ్నం చేశారు. విద్యార్థి నేతలను అదుపులోకి తీసుకొని బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మూడు దశాబ్దాల పోరాటంతో సాధించిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను, మాదిగ జాతి నోటికాడి ముద్దను రేవంత్ రెడ్డి ప్రభుత్వం దూరం చేస్తున్నదని మండిపడ్డారు. వర్గీకరణ చేయకుండా ఉద్యోగాలను భర్తీ చేయడం వలన మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వాపోయారు. ఎంఎస్ఎఫ్ నాయకులు కొమ్ము శేఖర్, డాక్టర్ పల్లెర్ల సుధాకర్, రాజు, పరశురాం, జనపాల మహేశ్, మంద అనిల్, కాసర్ల సైదులు, సిద్ధార్థ, నరేశ్, సతీశ్, విజయ్, రవీందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

15న బీసీల రౌండ్ టేబుల్ సమావేశం

కాచిగూడ, మార్చి 12: దేశ సంపదనను ప్రధాని మోదీ గుజరాత్ రాష్ట్రానికి కట్టబెడుతున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆరోపించారు. బీసీ రాష్ట్ర నాయకుడు కోలా జనార్దన్ గుజ్జ కృష్ణ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో వివిధ సంఘాల నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15న ఓబీసీ డెమోక్రటిక్ జేఏసీ ఆధ్వర్యంలో కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్లో రౌండ్ టేబుల్ సమావేశం (అఖిలపక్ష సమావేశం) నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. నీలం వెంకటేశ్, సుధాకర్, నందగోపాల్, ఉదయ్‌కుమార్, జయంతి, రాజు నేత, తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

చింతకుంట నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న డీపీవో జయసుధ, ఎంపీవో షఫివుల్లాఖాన్

ధారూరు,మార్చి 12 : పంచాయతీ కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం చేయవద్దని వికారాబాద్ జిల్లా పంచాయతీ అధికారి జయసుధ సూచించారు. బుధవారం మండల పరిధిలోని చింతకుంట, కేరెళ్ళి గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ఆయా పంచాయతీల్లో పలు రికార్డులను తనిఖీ చేశారు. చింతకుంట పంచాయతీ పరిధిలోని నర్సరీ, కంపోస్టు షెడ్, పశువుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టిని పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామ పంచాయతీలో ఇంటి పన్ను, నల్లా బిల్లులు, జనన, మరణ ధ్రువీకరణ రికార్డుల బిల్లులు, చెల్లింపు కార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఆమె వెంట ధారూరు ఎంపీవో షఫీవుల్లా ఖాన్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

కారులో నుంచి నగదు అపహరణ

యాలాల, మార్చి 12 : పట్టపగలే నడిరోడ్డు పై ఆగి ఉన్న కారులో నుంచి రూ.లక్షా 29 వేల నగదును దోచుకెళ్లిన ఘటన తాండూరు పట్టణంలో బుధవారం జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాలు.. వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండల పరిధిలోని బురాంపూర్ గ్రామానికి చెందిన ముడావత్ రాజు, శారద దంపతులు. శారద తల్లి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నది. ఆమె చికిత్స కోసం డబ్బులు అవసరం కాగా వీరు తాండూరులోని బ్యాంక్ ఆఫ్ బరోడాకు వచ్చి తన దగ్గర ఉన్న రెండున్నర తులాల బంగారాన్ని తనఖా పెట్టి రూ.లక్షా 30వేల నగదు తీసుకొన్నారు. వాటిలో నుంచి రూ. వేయి వారి అవసరాల నిమిత్తం వాడుకొని మిగిలిన రూ.లక్షా29వేలను ఓ కవరులో భద్రపరిచారు. ఆ కవరులోనే పట్టా పాసు పుస్తకం, వర్జనల్ ఆధార్ కార్డు పెట్టారు. బ్యాంకు పని ముగించుకొని కారులో వెళ్తున్న క్రమంలో రాజు శారద దంపతులు తినడానికి తాండూరు నడిబొడ్డున ఉన్న మెట్రో హోటల్‌కు వెళ్లి, భోజనం ముగించుకొని సాయంత్రం 5 గంటల ప్రాంతంలో తిరుగు ప్రయాణమయ్యారు. హోటల్ దాటగానే వెనక టైర్ పంక్చర్ అయినట్లు గుర్తించి కారును రోడ్డుకు పక్కన నిలిపారు. టైర్ పంక్చర్ చేయించుకొని వచ్చేంత వరకు కారులోనే ఉండాలని, కవర్‌ను జాగ్రత్తగా చూడాలని చెప్పి రాజు టైర్ తీసుకొని వెళ్లిపోయిన కొంత సేపటికే ఓ వ్యక్తి వచ్చి కారు వెనక టైరు పూర్తిగా వంగి ఉంది కిందపడే అవకాశం ఉందని మాయమాటలు చెప్పడంతో ఆమె కారు బోర్ తీసి కవర్ కారులో ఉంచి వెనక వైపు చూసేలోపు డబ్బులు ఉన్న కవర్‌తో పరారయ్యాడు. భర్తకు విషయాన్ని చెప్పడంతో వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తాండూరు పట్టణంలో ఇటీవల జరిగిన భారీ చోరీల విషయం మరవక ముందే మరో చోరీ ఘటనతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

పార్కులకు రక్షణేది!

- ప్రభుత్వ స్థలాలపై కాంగ్రెస్ కన్ను
- నందనవనం పార్కు కబ్జాకు యత్నం
- 20మంది బౌన్సర్లతో బోర్డు తొలగింపు
- అడ్డుకున్న కాలనీ వాసులు
- కేసు నమోదు చేసిన పోలీసులు

జవహర్‌నగర్, మార్చి 12: కాంగ్రెస్ పాలనలో పార్కులకు రక్షణ లేకుండా పోయింది. చెరువులు, ప్రభుత్వ స్థలాలు కాపాడుతామంటూ గొప్పలు చెబుతూ హైడ్రాను కేటాయించి హంగామా సృష్టించిన సీఎం రేవంత్‌రెడ్డికి నందనవనం పార్కు కనిపిస్తా లేదా అంటూ జవహర్‌నగర్ ఆనంద్‌నగర్ కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని 15వ డివిజన్ ఆనంద్‌నగర్‌కాలనీలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నందనవనం పార్కుకు 17 గుంటలు కేటాయించిన రూ. 35లక్షలతో సుందరీకరణ, జిమ్ పరికరాలతో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వంలో నందనవనం పార్కును నామరూపాల్లేకుండా కబ్జాచేద్దామని చూస్తున్న బడానేతల భరతంపట్టి పార్కును కాపాడాలని ఆనంద్‌నగర్‌కాలనీవాసులు కోరుతున్నారు. పట్టపగలే 20మంది బౌన్సర్లు, కిరాయి మనుషులతో నందనవనం పార్కు వద్దకు వచ్చి పార్కు బోర్డును తొలగించి లోపలికి ప్రవేశించి జిమ్ పరికరాలు, ఇతర వస్తువులను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఆనంద్‌నగర్‌కాలనీవాసులు ప్రాణాలకు తెగించి బౌన్సర్లను అడ్డుకునేందుకు వెళ్లగా బౌన్సర్లు తిరగబడ్డారు. వెంటనే కాలనీవాసులు పోలీసులకు సమాచారం అందించగా... ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. పార్కును తమ కాలనీకి లేకుండా చేయాలని చూస్తున్న దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో కబ్జాలకు కొదవలేదని, ప్రభుత్వ స్థలాలు మిగిలేలా లేవని, ప్రజలు సేదతీరేందుకు పార్కులు దక్కేలాలేవని జవహర్‌నగర్ ప్రజలు మండిపడుతున్నారు. నందనవనం పార్కు కబ్జా చేయాలని చూస్తే ఊరుకునేదిలేదని, మరో పోరాటానికి సిద్ధమవుతామని కాలనీవాసులు అన్నారు. ప్రభుత్వ ప్రాపర్టీ నందనవనం పార్కును ధ్వంసం చేసిన దుండగులపై జవహర్‌నగర్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని కమిషనర్ వసంత తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ధర్నాలో పాల్గొన్న అఖిల పక్షం నాయకులు

ఫోర్త్ సిటీలో నేదునూరును కలపాలి

కందుకూరు ,మార్చి 12: ఫోర్త్ సిటీలో నేదునూరు గ్రామాన్ని కలపాలని అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ గ్రామాన్ని ఫోర్త్ సిటీలో కలుపకుండా అన్యాయం చేస్తున్నదన్నారు. బుధవారం హైదరాబాద్ శ్రీశైలం రహదారి నేదునూరు గేటు వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మాజీ వైస్ ఎంపీపీ సమంత ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, సీపీఎం మాజీ కార్యదర్శి కుమార్, సురేందర్ రెడ్డి, వెంకటేశ్ మాట్లాడుతూ.. ఫోర్త్ సిటీలో తమ గ్రామాన్ని కలుపుకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాకేశ్ గౌడ్ ,రూప్ చందర్, శ్రీధర్, సురేశ్, మనోహర్, అమరేందర్‌రెడ్డి, రవీందర్ గౌడ్, బాల్ రాజ్, సాయిలు యాదయ్య పాల్గొన్నారు.

ప్రతిపక్ష పార్టీ సర్పంచ్‌లనే నెపంతో హౌస్ అరెస్టులు

దోమలో మాజీ సర్పంచ్‌ను హౌస్ అరెస్టు చేస్తున్న పోలీసులు

దోమ, మార్చి 12 : ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్‌లనే నెపంతో వారు చేపట్టిన పనులకు బిల్లులు ఇవ్వకుండా తాత్సారం చేయడమే కాకుండా హౌస్ అరెస్టులకు పాల్పడటం అప్రజాస్వామికమని మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. రాష్ట్ర మాజీ సర్పంచ్‌ల సంఘం పిలుపు మేరకు బుధవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మాజీ సర్పంచ్‌లు తమ బిల్లుల కోసం హైదరాబాద్ వెళ్లవలసి ఉండగా మాజీ సర్పంచ్ రాజిరెడ్డితో పాటుగా పాలేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ యశోద తిరుపతయ్యను సైతం దోమ పోలీసులు హౌస్ అరెస్టు